ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 64 | బుధవారం 3 డిసెంబర్ 2025 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...

బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715


## అమరావతికి రెండవ విడత


# భూసమీకరణ

## ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



**అమరావతి, డిసెంబర్ 2 :**

ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి కేబినెట్‌లో ఈభూముల సేకరణకు ఆమోదించారు. ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల పట్టా, ఎసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 1,965 ఎకరాలు, పెద్దమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాల పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమి.. కర్లపూడి లేమ్లలెలో 2,603 ఎకరాల పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురంలో 1,448.09 ఎకరాల పట్టా, 2.29 (మిగతా 2లో)





## డిమాండ్‌కు అనుగుణంగా

# విద్యుత్

- ఆర్టీసీకి మరో వెయ్యి ఈవి బస్సులు
- అందుకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు
- కొనుగోళ్ల భారం తగ్గేలా ఎంఓయూలు
- గత ప్రభుత్వం తీరుతో 9వేల కోట్ల భారం
- విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన
- విద్యుత్ ఉత్పత్తి, పంపిణీపై సిఎం సమీక్ష

**అమరావతి, డిసెంబర్ 2 :**

ఆర్టీసీకి మరో వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యుదుత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఎంవోయూలు కుదుర్చుకోవాలి. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంవోయూలు చేసుకోవాలి. రాష్ట్రంలో పీఎం కుసుమ్ సహా రూఫ్‌టాప్ ప్రాజెక్టులు వేగంగా అమలు చేయాలి. ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు 2లో

## మొంతా తుఫాన్

# సాయం ఇవ్వండి

- అమిత్‌షాతో లోకేశ్ భేటీ
- మొంథా తుఫాన్ నష్టంపై వివరణ
- త్వరగా సాయం కోరిన లోకేశ్
- ఏవియేషన్ సిటీపై జిఎంఆర్ అధికారులతో చర్చ



**న్యూ ఢిల్లీ. డిసెంబర్ 2 :**

మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్నే మిగిల్చింది.. ఇప్పటికే ప్రాథమిక అంచనాలపై కేంద్రానికి నివేదిక చేరగా.. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. మొంథా తుపాను కారణంగా ఆంధప్రదేశ్‌లో భారీ నష్టం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో తుపాను నష్టాలపై మంత్రి నారా లోకేష్ పూర్తి నివేదికను (మిగతా 2లో)

# బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు

- డికె ఇంటికి వచ్చి అల్పాహారం చేసిన సిద్ధరామయ్య
- అధిష్టానం కోరుకుంటే డికె సిఎం అవుతారని కామెంట్..



**బెంగుళూరు, డిసెంబర్ 2 :**

కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఊహాగానాల వేళ బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారం వేళ రెండు రోజుల క్రితం సీఎం సిద్ధరామయ్య నివాసానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు డీకే ఇంటికి సీఎం సిద్ధూ బ్రేక్‌ఫాస్ట్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఇంటికి వచ్చిన సీఎంకు డీకే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య (మిగతా 2లో)

# క్షమాపణలు చెప్పండి

- తెలంగాణలో మీ సినిమాలు ఆడవ్
- క్షమాపణలు చెబితే ఒకటి రెండు రోజులు ఆడనిస్తాం...
- రాజకీయాలు తెలియని పవన్ కళ్యాన్ ..
- అన్నీ తెలుసుకుని మాట్లాడితే మంచిది..
- తెలంగాణ ప్రజలను కించపరిస్తే ఊరుకోం
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్, డిసెంబర్ 2 :**

ఎపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియవని తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం కాగానే ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోనసీమలో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే.. తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే నీ సినిమాలు (మిగతా 2లో)

# గంజాయి డాన్‌కు చెక్

- గంజాయి డాన్ కామాక్షమ్మ ఇళ్లను కూల్చేసిన ప్రజలు
- పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతో పాటు ఇతరులను అరెస్టు చేయాలని డిమాండ్...



**నెల్లూరు, డిసెంబర్ 2 :**

నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యా యత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మ తోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని (మిగతా 2లో)



ఢిల్లీలో దళారుల మోసంతో రోడ్లపైనే అరటిని పారవేస్తున్న అనంత రైతన్నలు

## కలసిరాని కాలం

## అరటి తీరు

# ఘోరం

- అరటి రైతు ఆవేదన.. పట్టింపులేని నివేదన..
- ఉత్తరాదిన పెరిగిన దిగుబడులు.. దక్షిణాదిన తగ్గిన ధరలు..
- రెండో, మూడో పంటలు మట్టిపాలే...
- అనంతపురం జిల్లాలో కౌలు కూడా దక్కని దుస్థితి..

**షేక్షావలి, యాడికి, డిసెంబర్ 2 :**

అరటి రైతుకు కాలం కసిరాలేదు. జిల్లాలో పంట సాగుచేసిన అరటి రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అరటి దిగుబగులు పుష్కరంగా ఉన్నా ధర అమాంతం పడిపోవడంతో డీలా పడ్డాడు. మరోవైపు ఉత్తరాదిన దిగుబడులు పెరిగడం, దక్షిణాదిన ధరలు తగ్గడం రైతుకు పిడుగుపాటులా తగింది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో, మూడో పంటలు మట్టిపాలే అని రైతులు వాపోతున్నారు. ఈసారి కౌలు కూడా దక్కని దుస్థితి నెలకొంది. జిల్లాలో అరటి పంట సాగు విస్తీర్ణం సుమారు 35 వేల ఎకరాలు. తాడిపత్రి ప్రాంతంలో సాగు విస్తీర్ణం: 2,600 ఎకరాలు. ఎకరాకు పెట్టుబడికి రూ. 1.5 లక్షలు. గుబడి 20 టన్నులు, టన్ను ధర రూ. 8 వేలు ప్రతిఫలం భూమి ఉన్న రైతులకు అరకొర గిట్టుబాటు, కౌలు రైతులకు రూ. 25 వేల నుంచి 30 వేల వరకు (మిగతా 2లో)

# కేసులకు భయపడం

- నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు...
- సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం...
- రాహుల్‌ను ప్రధాని చేయడమే మన అంతిమ లక్ష్యం...
- పార్లమెంట్‌లో ఓట్ చోరీపై చర్చ రాకుండా కుట్రలు...
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే..
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం...
- పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ కీలక ప్రసంగం...



**హైదరాబాద్, డిసెంబర్ 2 :**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, (మిగతా 2లో)

# బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు



(మొదటి పేజి (తరువాయి)

మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం దిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.

# డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్

(మొదటి పేజి (తరువాయి)

60 రోజుల్లో కార్యాచరణ ప్రారంభించేలా చూడాలన్నారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది ప్రోత్సాహకాలు కొనసాగించాలి. థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు వినియోగించాలి. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు వస్తాయి. రాష్ట్రంలో 5వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశంచేశారు. సమీక్షలో విద్యుత్ వ్యవస్థపై గత ప్రభుత్వ విధానాలు ప్రస్తావనకు వచ్చాయి. అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని గత పాలకులు అస్తవ్యస్థం చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. పీపీఏ రద్దుతో రూ.9వేల కోట్ల భారాన్ని వైకాపా ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. విద్యుత్ వినియోగించ కుండానే ప్రజాధనాన్ని కంపెనీలకు చెల్లించిందని చెప్పారు. ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. . ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. గత అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్థం చేశారు. పీపీఏ రద్దుతో రూ.9వేల కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోపింది. విద్యుత్ వినియోగించకుండానే ప్రజా ధనాన్ని కంపెనీలకు చెల్లించిందని విమర్శించారు.

# మొంథా తుఫాన్ సాయం ఇవ్వండి

(మొదటి పేజి (తరువాయి)

కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రి లోకేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టపరిహారం అవసరాలపై సమగ్ర వివరాలు లోకేష్ అందించారు. తుపాను వల్ల మొత్తం రూ.6,352 కోట్ల నష్టం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది.
మొంథా తుపాను మొత్తం 3,109 ప్రభావిత గ్రామాల్లో ప్రభావం చూపించింది.. తుపాను తీరం దాటి సమయం: అక్టోబర్ 28 రాత్రి, కాకినాడ సమీపంలో గాలి వేగం గంటకు 100 కి.మీ వేగంతో ఉంది. అయితే, పునరావాస చర్యల్లో 1.92 లక్షల మందిని 2,471 శిబిరాలకు తరలించాం. తుఫాను అనంతరం ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున వెంటనే రూ.3,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం పంపిణీ చేసింది. అదేవిధంగా, కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టినట్లు లోకేష్ వివరించారు. అత్యవసర అవసరాల నిమిత్తం రూ.60 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే దిల్లీలో ఏపీ మంత్రి లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ద్వారా విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల.. విద్య, శిక్షణకు హబ్‌గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై

# చర్చకు అంగీకారం

## 8న వందేమాతరం..9న ఎన్నికల సంస్కరణలపై చర్చ
## స్పీకర్ సమక్షంలో అఖిలపక్ష భేటీలో విపక్షాల అంగీకారం



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 2 :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రత్యేకంగా 'సర్'పై కాకుండా ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనుంది. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో కేంద్రం, విపక్షాల మధ్య అవగాహన కుదిరింది. ఆ ప్రకారం డిసెంబర్ 8న వందేమాతరం పై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరుగనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 'లోక్‌సభ స్పీకర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నందున దానిపై డిసెంబర్ 8 తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి చర్చ జరపాలని సమావేశం నిర్ణయించింది. అలాగే డిసెంబర్ 9 తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎన్నికల సంస్కరణలపై చర్చ మొదలవుతుంది' అని కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. కాగా, అఖిలపక్ష సమావేశానంతరం మీడియాతో కాంగ్రెస్ విప్ కె.సురేష్ మాట్లాడుతూ, ఎస్ఆర్ఐ అంశంపై చర్చించాలని విపక్షాలు కోరాయని, ఎస్ఐఆర్‌ను కూడా జతచేసి ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చకు సమావేశం నిర్ణయించిందని తెలిపారు. సభలో 10 గంటల చొప్పున రెండు డిబేట్లకు సమయం కేటాయించారని, అవసరమైతే సమయం మరింత పొడిగించే అవకాశం ఉంటుందని చెప్పారు.


# కేసులకు భయపడం




(మొదటి పేజి (తరువాయి)

రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్దరించే పక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ - 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర పరిపాలన గురించి మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నాం. కొత్త సర్పంచులు ఎన్నికయ్యే సందర్భంలో జిల్లా అధ్యక్ష పదవులు రావడం మీకు గొప్ప అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సులు వంటి సంక్షేమ పథకాలపై చర్చ పెట్టాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. కేసీఆర్ ఇచ్చిన చీరలు పనికిరావని ప్రజలు నిందించారు. కానీ, మనం నిజాయితీతో కోటి మందికి చీరలు ఇస్తున్నాం. ఏ ఆడబిడ్డ కూడా చీర దక్కకుండా ఉండకూడదని తెలిపారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన డిసెంబర్‌లో జరుగుతుందని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రానికి బుల్లెట్ ట్రైన్ ఎందుకు ఇవ్వడం లేదని మోదీని ప్రశ్నిస్తానని, ఇస్తే.. ప్రజలకి మంచిది, ఇవ్వకపోతే తెలంగాణ ప్రజల రియాక్షన్ బీజేపీ చూస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాళ్లకు కట్టెలు పెట్టడం సహజం. కానీ అక్కడే ఆగిపోవద్దు, ముందుకు సాగాలని కార్యకర్తలకు హితబోధ చేశారు.తాను సీఎం అయ్యేముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకంగా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అరటి తీరు ఘోరం



(మొదటి పేజి (తరువాయి)

నష్టం. విపణిలో డజను(1.5 కిలోల) అరటిపండ్లు రూ.45ల, అంటే కిలో రూ.30 లెక్కన టన్ను: 30 వేలు. కానీ రైతుకు దక్కుతోం రూ.3 వేలు నుంచి రూ.8 వేలు మాత్రమే. అంటే అన్నదాత నుంచి అమ్మకందారుని వద్దకు వచ్చేసరికి టన్నుకు దాదాపు రూ.20 వేల నుంచి రూ.27 వేలు దళారులు మింగేస్తున్నారన్నది నిర్విదాంశం. మొక్కల్లో మోసం.. పెనుభారంగా మారిన పెట్టుబడులు.. పీడించే చీడపీడలు.. ఆపై ప్రకృతి చిన్నచూపు.. ఇలా అన్నింటిని జయించి రేయింబవళ్లు కంటికి రెప్పలా కాపాడి అన్నదాతలు పండించిన పంటలకు ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా ఆశించిన ధర లభించడం లేదు. జిల్లాలో అరటి గుబడులకు కొద్ది రోజులుగా తగ్గుతున్న ధరలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కష్టానికి తగ్గ ఫలితం దక్కని కర్షకులు కంటిమీద కునుకులేక తల్లడిల్లుతున్నారు. కలసిరాని కాలం.. జూదంలా మారిన వ్యవసాయం... రెక్కల కష్టానికి ఫలితం అప్పులు.. అవస్థలు.. ఇలాంటి పరిస్థితుల్లోనూ తమకు తెలిసిం వ్యవసాయమే కావడంతో కర్తకులు వేరే దారిలేక కష్ట నష్టాలను భరిస్తూ సాగునే నమ్ముకొని ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అరటి రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. గిట్టుబాటు ధర లేక కంటికి రెప్పలా కాపాడుకున్న అరటి పంటకు కళ్లెదుటే కూల్చేసుకుంటున్నారు. జిల్లాలో కౌలు కూడా దక్కని దుస్థితి..అనంతపురం జిల్లా వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో అరటి సాగు చేయగా రెండో పంటకు రూ.175 కోట్లు పెట్టుబడికి ఖర్చయ్యిం. రెండో వంట ఎకరాకు సగటున 20 టన్నుల దిగుబడి వంతున 7 లక్షల టన్నులు రాగా.. టన్ను రూ. వెయ్యి ధర కూడా పలకడం లేదు. ఒకవేళ కనీస మద్దతు ధర పలికినా వచ్చే రాబడి రూ.70 కోట్లు, అన్నదాతలకు ఎకరాకు మిగులుతోం. కేవలం రూ.20 వేలు, రూ.1.5 లక్షలు పెట్టిన చోట రూ.20 వేలు మిగిలితే రైతు ఏ రీతిన బయట పదాలని రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రెండో, మూడో పంటకు గిరాకీ లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి, రెక్కల కష్టం మట్టిపాలు కావాల్సిందేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో 50 శాతం పైగా కౌలు రైతులే. కౌలు ధర కూడా దక్కడం లేదు. ఇక రెండో పంటయితే రాబడి కూడా గగనమే. గతేదాది ఈదే సమయంలో పలికిన ధర రూ.20 వేలు కాగా ఆ లెక్కన రైతులకు రాబడి రూ. 1,400 కోట్లు రావాల్సి ఉం. కానీ నేటి ధరలతో పోల్చితే గగనమే అంతా సవ్యంగా ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్నదాతలకు రెండో వంటకు రూ.6 వేలు టన్ను పలికినా రూ.420 కోట్లు మిగిలే. అంటే గతేడాతో పోల్చితే నష్టపోతోం సుమారు 350 కోట్లు. తాడిపత్రి ప్రాంత రైతులైతే 2,600 ఎకరాలకు దాదాపు రూ.31 కోట్లు. అంటే మొత్తం జిల్లా వ్యాప్తంగా పోల్చుకుంటే 10 శాతం ఇక్కడి రైతులే నష్టపోతున్నారన్న మాట.అధిక దిగుబడే అన్నదాతలను ముంచుతోందా. .ఈ ఏడాది అనంతపురం జిల్లాలో 30 శాతం సాగు విస్తీర్ణం పెరగడం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాల్లో అరటి సాగు, గుబడి పెరగడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని అధికారులు చెబుతున్నారు. అనంతపురం జిల్లా నుంచి అరటి ఎక్కువగా ఢిల్లీకి ఎగుమతి ఎగుమతి అవుతుం. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఢిల్లీకి అరటి వెళ్తుండడంతో మన జిల్లా అరటికి డిమాండ్ తగ్గిందని, దీంతో స్థానిక మార్కెట్ మీదనే రైతులు ఆధారపడ్సా మస్తోందని యంత్రాంగం అభిప్రాయ పడుతోంది. రెండో పంట, మూడో వంటలో నాణ్యత తగ్గిందని, అదే సరుకు మహారాష్ట్రలో నాణ్యత బాగా ఉండటంతో మన అరటికి డిమాండు. తగ్గుతోందనే వాదన వ్యాపారుల్లో బలంగా వినిపిస్తోం. బయట టన్ను రూ.25 వేలు పలుకుతోంటే ఇక్కడ కనీసం రూ. 6 వేలైనా ఛ్లెంచకపోతే ఎలా అని అనంతపురం జిల్లా కలెక్టర్ వ్యాపారులపై అసహనం వ్యక్తం చేయడం అన్నదాతల దీనావస్థకు నిదర్శనమని చెప్పవచ్చు.పులివెందుల నియోజకవర్గం ఒగాల మండలానికి చెందిన ఓ రైతు పొలం వద్ద అరటి పంటను ఎవరూ కొనకపోవడంతో సొంత డబ్బులతో అరటిని లారీలో ఢిల్లీ మార్కెట్‌కు తరంచారు. అక్కడ అమ్మాలని చూడగా అక్కడి దళారులు సిండికేట్ కావడంతో రైతు తెచ్చిన పంటను కొనుగోలు చేయలేదు. దీంతో లారీ లోడ్ అరటికాయలని జెసిపితో కిందవేయించి పడేశాడు. ఇటు పంట నష్టం, రైతుల ఖర్చు నష్టం, ఢిల్లీకి వెళ్ళి అమ్మాలని చూస్తే దళారీల సిండికేట్. ఇక రైతు బాగుపడే రోజులు రావా అని ఆవేదన చెందుతున్నాడు.

# క్షమాపణలు చెప్పండి

(మొదటి పేజి (తరువాయి)

ఆడవని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. పవన్ కల్యాణ్ సోదరుడు చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదని గుర్తు చేశారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హితవు పలికారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము ఎంతో నష్టపోయామని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయాన్ని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్ల నష్టపోయామని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు. కోనసీమ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నాయకుల దిష్టి వల్ల ఈ ప్రాంతంలోని కొబ్బరి మొక్కలు ఎండిపోయాయంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ తెలంగాణ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# గంజాయి డాన్‌కు చెక్

(మొదటి పేజి (తరువాయి)

స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులతోపాటు సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు అమె బంధువులు, అనుచరుల నివాసాలను స్థానికులు కూలగొట్టారు

# రెండవ విడత భూ సమీకరణ

(మొదటి పేజి (తరువాయి)

ఎకరాల అసైన్డ్, పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా మరో గ్రామం కలిపి మొత్తం 7 గ్రామాల్లో 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్‌భూముల్ని సమీకరించాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూసమీకరణలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది.

# అఖండ-2 టికెట్ల ధర పెంపు

## ఏపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఈనెల 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అఖండ2' టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.సింగిల్ స్క్రీన్‌లో రూ.75, మల్టీ ప్లెక్స్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) ధర పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. డిసెంబరు 4న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ప్రీమియర్‌కు కూడా అనుమతి లభించింది. ఈ టికెట్ ధరను రూ.600గా (జీఎస్టీతో కలిపి) నిర్ణయించారు. రోజుకు ఐదు షోలతో పాటు, పెంచిన ధరలు విడుదల తేదీ నుంచి 10 రోజుల పాటు అమల్లో ఉంటాయి.

# చంద్రబాబు అనైతిక రాజకీయాలు

## మా ఎమ్మెల్సీలతో రాజీనామాల కుట్ర
## మాజీమంత్రి పేర్ని నాని ఘాటు విమర్శలు




**అమరావతి, డిసెంబర్ 2 :**

తప్పుడు రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీ నేత,మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వంపై మరోసారి పేర్ని నాని కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. చంద్రబాబు గతంలో ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను మంత్రులుగా ప్రమాణం చేయించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. మనుషులను ప్రలోభాలకు గురి చేయడంలో చంద్రబాబుకు సరితూగే వ్యక్తి లేరని విమర్శించారు. కొనుగోలుదారులను సిద్ధం చేసి, బయానాలు ఇప్పించి, నేతలను రాజీనామా చేయించేందుకు ఒత్తిడి తెస్తారని ఆరోపించారు. రాజీనామా చేసిన వారిని ఆమోదించమని సంబంధిత పార్టీలు అడగాలి, కానీ ఇక్కడ పరిస్థితి రివర్స్‌గా ఉందని అన్నారు. మా పార్టీ ఎమ్మెల్సీల రాజీనామాలు కూడా చంద్రబాబు రాజకీయ అనైతిక క్రీడలో భాగమేనని పేర్ని నాని ఆరోపించారు. చంద్రబాబు చట్టాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో ఆరోగ్య కారణాలతో బెయిల్‌పై వచ్చారని, కానీ వెంటనే 18 గంటల ర్యాలీ నిర్వహించి, అప్పటి నుంచి ఆస్పత్రికి కూడా వెళ్లలేదని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ఉపయోగించకుండా, వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టేందుకే ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి అంశంపై కూడా ఆయన చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. అమరావతి విషయంలో రైతులను నట్టేట ముంచే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. గతంలో జగన్ శాసన రాజధాని ఇదేనని స్పష్టంగా చెప్పారు, కాని చంద్రబాబు మాత్రం అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.



సిఐటియు 18వ మహాసభ పోస్టర్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు

## సిఐటియు 18వ మహాసభ పోస్టర్ విడుదల

**యాడికి, డిసెంబర్ 2 :**
యాడికి మండలంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో, విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు మరియు సిఐటియు నాయకులు కలిసి ఎంపీటీవో కార్యాలయం ఆవరణంలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంలో సిఐటియు నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు ఉమా గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడి చేసే విధానాలు అవలంబిస్తున్నాయని, లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు 26,000 గా నిర్ణయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లపై తీవ్ర పని భారం పెట్టి, సరైన వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన తెలిపారు. కొత్త ప్రభుత్వాలు వచ్చిన తరువాత అంగన్వాడీ, ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయని, అదనంగా అధికారుల వేధింపులు తీవ్రతరమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే అంగన్వాడీ, ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ,లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలని, సమాన పనికి సమాన వేతనం 26,000 ఇవ్వాలని, వర్కర్లకు నాణ్యమైన మొబైల్ ఫోన్లు అందించాలని, అధిక యాప్ సర్వేలను తగ్గించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాబోయే రోజుల్లో సిఐటియు భారీ స్థాయి ఉద్యమాలు మరియు పోరాటాలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంగన్వాడి కార్యదర్శి మహాలక్ష్మి, బషీర్ అహ్మద్, మాయకుంట్ల మోహన్, పెద్దన్న, శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.




గాంధీ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టిన సిపిఎం నాయకులు

## పెంచలయ్య హంతకులను అరెస్టు చేయాలి

*సిపిఎం ఆధ్వర్యంలో నిరసన..*

**గుత్తి, డిసెంబర్ 2:**
నెల్లూరు జిల్లాకు చెందిన సిపిఎం నాయకులు పెంచలయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుత్తిలో సిపిఎం నాయకులు పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.నెల్లూరు జిల్లాలోని సిపిఎం నాయకుడు పెంచలయ్యని గంజాయి ముఠా కామాక్షమ్మ తదితరులు హత్య చేశారు వారిని వెంటనే శిక్షించాలని సిపిఎం నెల్లూరు జిల్లాలో ఈరోజు బంద్ కు పిలుపునిచ్చారు. బంద్‌కు మద్దతుగా మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని ఆర్డిటి కాలనీలో నివసిస్తున్న సిపిఎం పార్టీ యువ నాయకుడు పెంచలయ్య కళాకారుడు గంజాయికి వ్యతిరేకంగా స్కూల్, కాలేజీల వద్ద యువతకు పాటలు పాడుతూ అవగాహన కల్పిస్తుంటాడన్నారు. గంజాయి ముఠాకి చెందిన కామాక్షమ్మ , వారి అనుచరులు నవంబర్ 29 తేదీ 19 సార్లు కత్తితో పొడిచి పొడిచి చంపారన్నారు. ఎక్కడ చూసినా గంజాయి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా సరఫరా జరుగుతున్నాయని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మత్తుపదార్థాల ముఠాలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి గంజాయి నిర్మూలనకు సమర్థవంతంగా పనిచేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించాయన్నారు. ఇప్పటికే మత్తు పదార్థాలు సేవించి యువకులు మహిళలని చిన్నపిల్లల్ని అత్యాచారాలు చేసి చంపుతున్నారన్నారు. ఎన్నో సందర్భాల్లో మహిళల పైన అత్యాచారాలు జరిగి చిన్నపిల్లల పైన అత్యాచారాలు జరిగినప్పటికీ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం వాటి పైన దృష్టి పెట్టి గంజాయి మాఫియాలను అరికట్టలేకపోతున్నారని మండిపడ్డారు. రాబోవు రోజుల్లో మత్తు పదార్థాలు అరికట్టకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతలు వహించి వారిని ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రేణుకమ్మ, మల్లికార్జున, నవీన్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## రేషన్ షాప్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

*జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్ ..*

**తాడిపత్రి, డిసెంబర్ 2:**
రేషన్ షాప్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొని, ఆడీలర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్ హెచ్చరించారు తాడిపత్రి మండలం గన్నేవరిపల్లి కాలని ఫైర్ ప్రైస్ షాప్ నెంబర్ 1209034 ను జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, తాడిపత్రి సి.ఎస్.డి.టి మల్లేష్ విచారణ చేపట్టారు. ఈ పాస్ మిషన్‌లో నిల్వలు మరియు భౌతిక నిల్వలు పరిశీలించగా పీడీఎస్ బియ్యం 240 కేజీలు, రాగులు 230 కేజీలు, జొన్నలు 5 కేజీలు, వ్యత్యాసంఉన్నందున తాత్కాలికంగా ఎఫ్.పి షాప్ ను సీజ్ చేసి, నిల్వలు భద్రత నిమిత్తం విఆర్‌ఓకి స్వాధీన పరిచామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం 6ఎ కేసు నమోదు చేసి జిల్లా సంయుక్త కలెక్టర్ కి సిఫారసు చేశామని తెలిపారు.



రేషన్ షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్

## రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన యలగలవంక జడ్పీ హైస్కూల్ విద్యార్థి సందీప్

*అభినందించిన డివైఈఓ మల్లారెడ్డి, ఎంఈఓ 2హరికృష్ణ, హెచ్ఎం రఘురాం...*

**బెళుగుప్ప, డిసెంబర్ 2:**
బెళుగుప్ప మండలం పరిధిలోని యలగలవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సందీప్ రాష్ట్రస్థాయి కౌశల్ -2025 పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రఘురాం తెలిపారు. జిల్లాస్థాయి ఆన్లైన్ కౌశల్ పోస్టర్ ప్రజెంటేషన్ థీమ్ 1 ఆన్లైన్ పరీక్ష పోటీలలో జిల్లాస్థాయిలో రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు సందీప్ ఎంపికయ్యాడన్నారు. ఈ నెల డిసెంబర్ 27న తిరుపతి లో జరుగబోయే కౌశల్ -2025 పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి సందీప్ తో పాటు, గైడ్ టీచర్ గా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయులు సూరిబాబు ను డివైఈఓ మల్లారెడ్డి,యంఈఓ 2 హరికృష్ణ, హెచ్ యం రఘురామ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలలో కూడా సందీప్ విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



# గుత్తి ఆర్టీసీ బస్టాండ్ గబ్బుగబ్బు..

### అపరిశుభ్రతతో అసౌకర్యం..
### పేరుకుపోతున్న చెత్తాచెదారం..
### గుంతల్లో మురికినీరు నిల్వ..
### కంపుకొడుతున్న వైనం..



గుత్తి ఆర్టీసీ బస్టాండ్

**గుత్తి, డిసెంబర్ 2:**
గుత్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అసౌకర్యాలకు, అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు మొత్తం గత కొంతకాలంగా తీవ్రదుర్గంధాన్ని వెదజల్లుతోంది. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శిధిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు అందడం లేదని అంతేకాక పరిసరాల్లో వెలవడుతున్న తీవ్ర దుర్గంధం కారణంగా బస్టాండ్ లో నిలబడాలంటే అసహ్యం వేస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిధిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ బస్టాండ్ స్థానంలో కొత్త బస్టాండ్ నిర్మిస్తామని గత రెండు నెలల క్రితం అధికారులు ప్రకటించారు. అయితే అది నేటికీ ఆచరణలోకి రాలేదు. ఆర్టీసీ బస్టాండ్ లో కేవలం ప్రయాణికులు కూర్చోవడానికి ఏర్పాటు చేయబడ్డ బెంచీల స్థానంలో తప్ప ఆరుబయట స్థానంలో ఎటు చూసినా పెద్ద మొత్తంలో చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాల్లో తీవ్రమైన అపరిశుభ్రత నెలకొని ఉంది. పరిసరాలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం వల్ల పేరుకుపోయిన చెత్తాచెదారం నుండి తీవ్రమైన దుర్గంధంతో పాటు పెద్ద మొత్తంలో దోమలు ఈగలు చుట్టుముడుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఉండాలంటే కచ్చితంగా రోగాల బారిన పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని వెనుక వైపున గల స్థలంలో నిత్యం పలువురు పాదాచారులు ప్రయాణికులు బహిరంగ ప్రదేశం లోనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. అంతేకాక అంతేకాక బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో నిర్మించిన మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకొని ప్రయాణికులు అక్కడికి వెళ్ళటానికి సైతం సాహసించలేకపోతున్నారు. బస్టాండ్ లో మరుగుదొడ్ల నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ వాటి నిర్వహణలో కనీస బాధ్యతగా వ్యవహరించకపోవడంతో పాటు ప్రయాణికుల నుండి కేవలం ఐదు రూపాయలు మాత్రమే వసూలు చేయాల్సిందిగా ఒక్కొక్కరితో 10 నుండి 15 రూపాయల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. మరుగుదొడ్ల సంబంధించిన పిట్టు చేరుకోవటంతో అందులో నుండి తీవ్రమైన దుర్గంధంతో బస్టాండ్ పరిసరాలను కమ్మేస్తుంది. బస్టాండ్ పక్కన గల ఆరు బయట ప్రాంతంలోకి వెనుక వైపున గల కిట్టు వైపు నుండి వెలబడుతున్న మీరు ఇతరత్రా చెత్తాచెదరం గుంతల భయమైన రోడ్డుపైకి ప్రయాణికులకు పాదాచారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి వాటికి అవసరమైన తాత్కాలిక మరమ్మతులను సైతం అధికారులు నిర్వహించకపోవడం తీవ్ర విమర్శలకు భావిస్తుంది. ప్రయాణికుల సౌకర్యాలు కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వ అధికారులు గుత్తి ఆర్టిసి బస్టాండ్లో నెలకొన్న అపరిశుభ్రత అసౌకర్యాలపై దృష్టి సారించి మొట్టమొదటిగా బస్టాండ్ పరిసరాల్లో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్తాచెదరన్ని తొలగించి నెలకొన్న అపరిశుభ్రతను తొలగించి ప్రయాణికులకు కనీస ఆహ్లాదకర వాతావరణ అందుబాటులో తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్ వెనుక వైపు శిథిలావస్థకు చేరుకున్న భవనాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం





బస్టాండ్‌లో గుంతలు పడిన రోడ్డుపై నిలిచిపోయిన మురికి నీరు . ఓపెన్ డ్రైనేజీ కారణంగా తీవ్రదుర్గంధం వెదజల్లుతున్న ఆర్టీసీ బస్టాండ్

## రంగారెడ్డి భౌతికకాయానికి నివాళులు

### వైకాపా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి..

**తాడిపత్రి, డిసెంబర్ 2:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి తండ్రి రంగారెడ్డి భౌతికకాయానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాళులు అర్పించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో రంగారెడ్డి అనంతపురం నగరంలోని సవేరా హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం నిర్యాణం చెందారు. విషయం తెలుసుకున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి సవేరా హాస్పిటల్ కు వెళ్లి రంగారెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.



భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న వైకాపా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## అంగన్వాడీల సెక్టార్ సమావేశం

### సిడిపివో సాజిదా బేగం..

**యాడికి, డిసెంబర్ 2 :**
యాడికి ఎంపీటీవో సమావేశ భవనంలో సూపర్వైజర్ విజయ్ కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి సెక్టార్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో సిడిపిఓ సాజిదా బేగం మాట్లాడుతూ పోషణ పిల్లలకు. గర్భవతులకు గర్భిణీలు. చిన్నారులకు సమయానికి సరైన పోషకాహారం శుభ్రత వంటి అలవాటు కుటుంబంలో ప్రోత్సహించడం కోసం తండ్రులు తమ బిడ్డలను సంరక్షించే లా ఆహారాన్ని తినిపించేలా ప్రోత్సహించాలన్నారు. పెరుగుదల పర్యవేక్షణలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు ఎత్తులు బరువులు ఎలా గుర్తించాలి . అంగళ్వాడి కేంద్రాలలో జియో టాకింగ్ తప్పనిసరిగా చేయాలని కమ్యూనిటీ ఆధారిత తీవ్రమైన పోషకాహార లోపం నిర్వహణ ఆరోగ్యం మరియు విపోషకాహార విద్య సరైన తల్లిపాల పద్ధతులను ప్రోత్సహించడం పరిశుభ్రత పద్ధతులు%బూావీ, హీూవీ% పిల్లలను ఆకలి పరీక్ష ద్వారా గుర్తించడానికి ఉపయోగించే ఒక నిర్ధారణ పద్ధతి టి హెచ్ ఆర్ బాలామృతంతో నిర్వహిస్తారని వివరించారు. కొన్ని అంగన్వాడి కేంద్రాలలో పిల్లలు తక్కువగా ఉండడంతో అంగన్వాడి టీచర్లు గ్రామంలో తిరిగి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో చేర్పియాలని తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. చిన్నచిన్న గ్రామాలలో జనాభా ఎక్కువగా ఉన్న పిల్లలు మాత్రం తక్కువ ఉండడం 5 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే వారి గుర్తించి అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు మంచి పోషక ఆహారంతో పాటు మంచి విద్య నడవడిక మంచి అలవాట్లు నేర్పిస్తావని గ్రామ ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పి ఎం ఎం వి వై యాప్ గర్భవతులకు అప్డేట్ చేయాలని వారికి డబ్బులు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సాజిదా బేగం. సూపర్వైజర్ విజయ్ కుమారి. కోఆర్డినేటర్ పల్లవి అంగన్వాడీ కార్యకర్తలు హాజరైనారు.



అంగన్వాడిల సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ సాజిదా బేగం



కార్యక్రమానికి హాజరైన అంగన్వాడీ టీచర్లు

## తాడిపత్రి తహసీల్దార్‌గా సచిన్ రహర్

**తాడిపత్రి, డిసెంబర్ 2:**



తాడిపత్రి తహసీల్దార్‌గా సచిన్ రహర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు తాడిపత్రి తహసీల్దారుగా నియమితులైన సచిన్ రహర్ 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈయన 2026జనవరి 4 వరకు తహసీల్దార్‌గా విధుల్లో ఉంటారు.

## ఆత్మహత్యానికి పాల్పడిన యువతి మృతి

**యాడికి, డిసెంబర్ 2 :**
యాడికి మండల కేంద్రానికి చెందిన నందిని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. నవంబర్ 29న ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబుకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నందిని



వెంగమనాయుడు కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లచెట్లను తొలగిస్తున్న జనసేన నాయకులు

## రహదారికి ఇరువైపుల ముళ్లకంపలు తొలగింపు

*జనసేన పార్టీ నాయకులు..*

యాడికి. డిసెంబర్ 2 :
యాడికి మండలం జనసేన పార్టీ మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వెంగమ నాయుడు కాలనీలో జెసిపి సహాయంతో కమలపాడు రోడ్డు ఇరువైపుల ముళ్ళకంపలు , చెత్త ఎక్కువగా ఉన్నచోట శుభ్రం చేయించారు. మధు ఆచారి, పెనుగొండ నాగభూషణం సొంత నిధులతో వెంగమ నాయుడు కాలనీలో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, చెత్త తొలగించారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల జన సైనికులు మధు ఆచారి, పెనుగొండ నాగభూషణం, వేల్పుల మల్లికార్జున, సోమ రాజేష్ , కాలనీ వాసులు జనసైనికులు పాల్గొన్నారు.



వెంగమనాయుడు కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లచెట్లను తొలగిస్తున్న జనసేన నాయకులు

## పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 2:**
వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న సాయి బాబా మందిరంలో గురువారం రోజు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు పాలకవర్గం సభ్యులు తెలిపారు. గురువారం, పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి, సందర్భంగా సామూహిక సాయి దత్త వ్రతం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతయి, నారాయణ సేవ, సాయంత్రం సాయి బాబా వారికి పుష్పాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తాదులు అధిక సంఖ్య పాల్గొని దైవ కృప పొందాలని పాలకవర్గం సభ్యులు కోరారు.



సీఐ శ్రీనివాసులుకు అభినందనలు తెలుపుతున్న వైసీపీ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు

## సిఐ శ్రీనివాసులుని సన్మానించిన వైసీపీ నాయకులు

**యాడికి, డిసెంబర్ 2 :**
యాడికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అర్. శ్రీనివాసులుని మంగళవారం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఇసి మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్. ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్ వైసీపీ నాయకులు పొంతల కిట్టయ్య, నాగప్రసాద్, కోడి చలపతి, ఓగేటి రంగా, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# గుడిపల్లి రిజర్వాయర్‌తో ఎవరికీ నష్టం రానివ్వం

**మంత్రి సవిత ..**

**సోమందేపల్లి, డిసెంబర్ 2:**
గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ఎవరికీ నష్టం రానివ్వబోమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రజలతో చర్చించిన తరవాతే ముందుకెళతామన్నారు. త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. నియోజక వర్గంలో మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమని మంత్రి సవిత సవాల్ విసిరారు. మండలంలోని గుడిపల్లి గ్రామం నుంచి తుంగోడు వరకూ చేపట్టిన రూ.2.80 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు, ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, సోమందేపల్లి మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.4.50 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, 40 గోకులం షెడ్లు నిర్మించామన్నారు. జేజేఎం పథకం ద్వారా మండలంలో తాగునీటి కల్పనకు రూ.3.33 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. సోమందేపల్లిలో రెండుసార్లు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ గండిపడితే యుద్ధప్రాతిపదికను మరమ్మతులు చేశామన్నారు. సోమందేపల్లిలో రూ.50 లక్షలు వెచ్చించి నూతన ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. నాగినాయని చెరువు గ్రామంలో ఎస్టీ హాస్టల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమందేపల్లిలో కాపు, బీసీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం ప్రభుత్వానికి పంపామని వెల్లడించారు. డీఆర్డీయే-వెలుగు ద్వారా 26,852 మంది మహిళలకు రూ.242 కోట్లకు పైగా అందజేశామన్నారు. మండలంలో 80 నేతన్నలకు 90 శాతం సబ్సిడీతో రూ.29 లక్షల విలువ చేసే మగ్గం పనిముట్లు అందజేశామన్నారు. 164 మంది చేనేతలతో స్మాల్ క్లస్టర్ ఏర్పాటు చేసి, రూ.కోటీ 16 లక్షలు అందజేశామన్నారు. ఇవేకాకుండా, మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు.


లభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

***మండలాల వారీగా అభివృద్ధిపై చర్చకు సిద్ధం..***
కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలో పెనుకొండ నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అన్ని డిపార్టుమెంట్లలోనూ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మండలాల వారీగా చేపట్టిన అభివృద్ది పనులపై చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. అర్హులైన పేదలందరికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. త్వరలో ఇళ్లు, నూతన పెన్షన్లు, రేషన్ కార్డులు అందజేయనున్నామన్నారు. తమది మంచి ప్రభుత్వమని, చెప్పని హామీలను సైతం అమలు చేస్తున్న కూటమి సర్కార్ కు ప్రజల మద్దతు ఎంతో అవసరమని అన్నారు. సోమందేపల్లి మండలంలో 2014-19 మధ్య ఎనిమిది రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ రోడ్ల నిర్మాణాలు ఎక్కడవక్కడ నిలిచిపోయావన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆ రోడ్ల నిర్మాణాలకు కదలికి వచ్చిందని, వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

***గుడిపల్లి వాసులకు ఇబ్బందులు రానివ్వం..***
గుడిపల్లి రిజర్వాయర్ తో ఎటువంటి ఇబ్బందులూ రానీయ్యబోమని మంత్రి సవిత స్పష్టం చేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, అధికారులతో కలిసి గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై చర్చిస్తామన్నారు. గుడిపల్లి వాసులతో చర్చించిన తరవాతే రిజర్వాయర్ నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎస్ఆర్ ఫండ్ల కింద గుడిపల్లి పంచాయతీలో రూ.35 లక్షలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు అపర భగీరథుడని, ఆయన వల్లే రాయలసీమలో తాగు, సాగు నీరందుతోందని మంత్రి సవిత తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం వల్ల మడకశిర, హిందూపురానికి తాగు, సాగునీరందుతోందని వెల్లడించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. త్వరలో మరిన్ని పరిశ్రమలు పెనుకొండకు రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గుడిపల్లి వాసులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సవిత


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్ విద్యార్థులను పలకరిస్తున్న ఎంపీడీవో గంగాధర్,

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ

*ఎంపీడీఓ గంగాధర్, ఎంఈఓ సిఎస్ నాయుడు..*

**అగళి, డిసెంబర్ 2 :**
మండలంలోని రామనపల్లి,కసాపురం పాఠశాలలను మంగళవారం ఎంపీడీఓ గంగాధర్, ఎం ఇ ఓ చంద్రశేఖర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలన చేశారు. ప్రధానంగా ఉపాధ్యాయులు,విద్యార్థులు హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. ఎఫ్, ఎల్, ఎన్, బేసలైన్ సర్వే ను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు గుణత్మాకమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ చదువు పట్ల ఆరా తీశారు.

## ఘనంగా హనుమద్ వ్రతం

**అగళి, డిసెంబర్ 2 :**
మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి కళ్యాణమండపం లో మంగళవారం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమద్ వ్రతం జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయ స్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కే ఏ వెంకటేష్ అధ్యక్షతన అర్చకులు ఉదయం నుంచి స్వామివారికి అభిషేకము ప్రత్యేక పూల అలంకరణతో హనుమద్వ్రతాన్ని హనుమాన్ చాలీసా ను జపించి శ్రీ కేజీఏ గుప్తా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యం లోనూ హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కేఏ వెంకటేష్ కుమార్, ఉపాధ్యక్షులు బీటీ కృష్ణప్ప,గుప్తా కళాశాల అధ్యక్షులు బి గోవిందప్ప, సెక్రెటరీ శ్రీనివాస్ మూర్తి,కోఆర్డినేటర్ శివప్ప,జాయింట్ సెక్రెటరీ రవికుమార్,ట్రస్టీలో రంగనాథప్ప, బెంగళూరు నుంచి వచ్చిన అతిథులు నాగభూషణ్ తేజస్, పాల్గొన్నారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు ఈసందర్భంగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

## చిగమతిఘట్ట చెరువు పరిశీలన

*ఎలాంటి అక్రమణలు జరగలేదు..*
*తహసీల్దార్ షేక్షావలి*

**రోళ్ల, డిసెంబర్ 2 :**
మండలంలోని యం. రాయపురం పంచాయితీ చిగమతిఘట్ట గ్రామ చెరువు ఆక్రమణ జరిగినట్టు స్థానికులు మండల తహసీల్దారు షేక్షావలి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయమై పోలీస్, ఇరిగేషన్ ఎఇఇ,రోళ్ళ సెక్షన్ వారికి విషయాన్ని తెలియబరచి వారితో పాటు మంగళవారం తహసీల్దార్ షేక్షావలి చెరువును తనిఖీ చేశారు. ఎలాంటి శాశ్వత నిర్మాణాలు జరగలేదని, కొంతమంది గొర్రెల కాపరులు రాత్రివేళలో కంచెవేసుకొని ఉన్నట్టుగా గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించినట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ఆక్రమణలు ఏవైన జరిగి ఉన్నట్టు అయితే వీటిపై సత్వరమే సర్వే చేయించి వాటికి హద్దులను నిర్దేశించి బౌండరీ ట్రంచస్ హద్దుల వెంబడి చెయ్యాలని యం పీ డీ ఓ కి విషయాన్ని తెలియజేశారు. మండలంలో అయిదు మైనర్ ఇరిగేషన్ చెరువులు ఇరవై వరకు పంచాయితీ రాజ్ చెరువులు మరి కొన్ని నీటి కుంటలు ఉన్నట్టు తెలియపరచారు. జలవనరులను ఏవైన ఆక్రమణలు గానీ అన్యాక్రాంతము గానీ జరిగినట్టు భావిస్తే వెంటనే మండల తహాశీల్దారు దృష్టికి తీసుకురావాలని,జలవనరులు సత్వరమే సర్వే చేయించి ఏవైన ఆక్రమణలు ఉన్నట్టు అయితే జీవో నెంబర్ 188 పంచాయితీ రాజ్ డిపార్ట్మెంటు వారి నియమానుసారం నోటీసులు ఇచ్చి వెంటనే పంచాయితీ రాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ డిపార్ట్మెంట్ వారు వెంటనే ఆక్రమణలు తొలగిస్తామని తెలియపరచారు. ఈకార్యక్రమంలో మండల తహసీల్దారు యస్ షేక్షావలి, ఇరిగేషన్ ఎఇఇ జె శ్రీనివాసులు, ఎ ఎస్ ఐ ఇదాయతుల్లా మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, నాయకులు రామక్రిష్ణ, బిలియప్ప, రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.


చిత్రావతి నదిలో కొత్త బోరుబావి వేసి కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడు

## ఉప్పరపల్లిలో తీరిన నీటి సమస్య

*సర్పంచ్ చల్లా చొరవ..*
*రూ.2.50 లక్షల మండల గ్రాంటు మంజూరు..*

**?బత్తలపల్లి, డిసెంబర్ 2:**
బోరుబావి పాడుబడిపోవడంతో తీవ్ర నీటి సమస్యతో సతమతమవుతున్న ఉప్పర్లపల్లి గ్రామానికి,గ్రామ సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడు కేవలం 24 గంటల్లో పరిష్కారం చూపారు. చిత్రావతి నది నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు పాడైన విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా,ఆయన తక్షణమే స్పందించారు. గ్రామ పంచాయతీలో నిధులు లేనందువల్ల,మండల గ్రాంటు ద్వారా సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి,ఎంపీడీఓ నరసింహనాయుడుతో చర్చించారు. దీంతో రూ.2.50 లక్షల మండల గ్రాంటు కింద మంగళవారం కొత్తగా చిత్రావతి నదిలో బోరు వేసి,కొత్త మోటారు,పైపులైను,స్టార్టర్ ఏర్పాటు చేశారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించిన సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడుకు,సహకరించిన ఎంపీపీ,ఎంపీడీఓలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యూత్ విభాగం మండల అధ్యక్షులు కొట్టం శేఖర్ పాల్గొన్నారు.

## వైభవంగా హాల్కూర్ ఆంజనేయస్వామికి హెూమం

**కళాశాలతో మహిళల ఊరేగింపు. .**

**అమరాపురం, డిసెంబర్ 2:**
మండల పరిధిలో హల్కూర్ గ్రామంలో వెలసిన పురాతన కాలము నాటి దేవాలయం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం. శ్రీ ఆంజనేయ స్వామి కి అర్చకులు హెూమం,, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి పూలతో అలంకరణ చేశారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కుబడును తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తాదులకు అన్నదానం నిర్వహించారు.


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


శ్రీ ఆంజనేయ స్వామికి పూలతో అలంకరణ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు. భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

## సీఐటీయు 18వ మహాసభలను జయప్రదం చేయండి

**తనకల్లు, డిసెంబర్ 2:**
సీఐటీయు 18వ మహాసభలను జయప్రదం చేయాలంటూ తనకల్లు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశావ్యాప్తంగా గత మూడు సంవత్సరాలనుండి చేపట్టిన పోరాటాలను ఈ మహా సభలో సమీక్ష చేసుకొని భవిష్యత్తులో చేపట్టాల్సిన పోరాటాలకు ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభల ముగింపు జనవరి 4వ తేదీన ప్రదర్శనలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు శివన్న, ట్రాన్స్పోర్ట్ రంగం నరసింహారెడ్డి, అంజి, భవన నిర్మాణ కార్మికులు వెంకటేష్, గోవిందు, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు వివి రమణ, ఎస్వి రమణ, తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయు 18వ మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

## రంగాపురంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**రోళ్ల, డిసెంబర్ 2 :**
మండలంలోని రంగాపురం గ్రామం లో వెలసిన అంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ హనుమంతునికి అభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం వివిధ రకాల పూజలు అర్చకులు నిర్వహించారు. శ్రీ హనుమంతునికి పూలతో అలంకరణ చేశారు . భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు భక్తులకు అన్నదానం నిర్వహించారు.



## కొండగట్టుపల్లిలో మెగా వైద్య శిబిరం

**260 మందికి వైద్య సేవలు..**
**క్యాన్సర్ నుంచి కార్డియాలజీ వరకు**
**అన్నీ ఒకే చోట ఉచితం..**
**గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు ..**
**ఆరోగ్యరంగానికి ఊతం..**

**ముదిగుబ్బ, డిసెంబర్ 2:**
ముదిగుబ్బ మండలం కొండగట్టుపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపుతో, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 260 మంది లబ్ధి పొందారు. శిబిరాన్ని పరిశీలించడానికి మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ శిబిరంలో 120 మంది మహిళలు, 140 మంది పురుషులు పాల్గొనడం గ్రామాల్లో ఆరోగ్య అవగాహన పెరుగుతున్న సంకేతమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సౌకర్యాల కొరతను దృష్టిలో పెట్టుకుని, మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాజీపడటం లేదని హరీష్ తెలిపారు. వైదేహి హాస్పిటల్ సహకారంతో అవసరమైన రోగులకు పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు అందించే ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గత నెలలో మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న పలువురికి బెంగళూరులో ఉచిత ఆపరేషన్లు నిర్వహించేందుకు మంత్రి ప్రత్యేకంగా ముందుకొచ్చినట్లు గుర్తు చేశారు. ఈ శిబిరంలో క్యాన్సర్, గుండె వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, కీళ్ళు-ఎముకల సమస్యలు, కిడ్నీ, గ్యాస్ట్రో, న్యూరో, ఇ.ఎన్.టి. తదితర విభాగాల వైద్యులు సేవలందించారు. అదనంగా ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బిపి, ఆర్బిఎస్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అధిక చికిత్స అవసరమయ్యే రోగులకు డా.ఎన్టిఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ - పిఎంజెఏవై పథకాల ద్వారా పూర్తిగా ఉచిత శస్త్రచికిత్సలు అందుబాటులో ఉంటాయని హరీష్ తెలిపారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

***"ఆరోగ్యం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం"***
ప్రతి గ్రామానికి నిపుణుల వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో నిరంతరం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని, ఈ శిబిరాలు వారికి ఎంతో ఉపయుక్తమవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైదేహి హాస్పిటల్‌కు చెందిన డా.భరణి బృందం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, పరిశీలనాధికారులు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయులు చెన్న కృష్ణారెడ్డి,పిడి నాగరాజు


## జిమ్నాస్టిక్ పోటీల్లో కాంస్య పతకాలు

*మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ..*

**బత్తలపల్లి, డిసెంబర్ 2:**
మండలంలోని మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 69వ రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జిమ్నాస్టిక్ పోటీలలో కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు చెన్నక్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పీడీ నాగరాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడలో నవంబర్ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిమ్నాస్టిక్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగినట్లు తెలిపారు. ఇందులో 13 పూర్వ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లా మాత్యవంతం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి బిల్లే రాము, నందన కుమారి పాల్గొన్నట్లు తెలిపారు. వారు జిమ్నాస్టిక్ లో ప్రతిభ కనబర్చి క్యాంస పతకాలు సాధించి మూడవ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఎస్ఎంపి సభ్యులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

## భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

**ఎస్బిఐ కాలనీలో విషాదం ..**



**బత్తలపల్లి, డిసెంబర్ 2:**
భార్య తనతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయి, ఎంత పిలిచినా తిరిగి కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన వివాహితుడు ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మంగళవారం బత్తలపల్లి మండల కేంద్రంలోని ఎస్బిఐ కాలనీలో చోటుచేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బత్తలపల్లి ఎస్ బీఐ కాలనీలో నివాసముంటున్న మినమనూరి మధు పెద్ద కుమారుడు అశోక్ కుమార్(28)కు అనంతపురం పట్టణానికి చెందిన రాణితో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. అన్యోన్యంగా సాగుతున్న వారి దాంపత్యంలో గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో రాణి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంత పిలిచినా భార్య కాపురానికి తిరిగి రాలేదు. దీంతో అశోక్ కుమార్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో పాపిలి మండలం బొంచేరుపల్లి స్వగ్రామంలో జాతరకు అశోక్ కుమార్ తల్లిదండ్రులు, తమ్ముడు లోకేష్ గత నెల 30న వెళ్లారు. ఇంటిలో అశోక్ కుమార్ ఒక్కడే ఉండిపోయారు. సోమవారం రాత్రి ఇంట్లో టీవీ ఆన్లో పెట్టుకొని, తాళాలు వేయకుండా ఇంట్లో సీలింగ్ కొక్కికి గొలుసుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్న తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లగానే కుమారుడు విగతజీవిగా వేలాడుతూ కనిపించగానే గుండెలు పగిలేలా రోదించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి


## దీక్షలకు మద్దతు.. మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలి .. ఆందోళనకు బుట్టా, సాయి మద్దతు..

**ఆదోని డిసెంబర్ 2:**
కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడి ఉన్న పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లా చేయాలని, ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి, ప్రభుత్వమే నిర్వహించాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదోని జిల్లా కేంద్రం కోసం కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహం ముందు గత 16 రోజుల నుంచి ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు వారిరువురూ ఊరేగింపుగా వచ్చే మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బుట్టా రేణుక, సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆదోని పట్టణాన్ని జిల్లా చేయాలన్న కోరిక ప్రజల నుంచి వచ్చిందని ఉద్యమముగా మారిందని వారు పేర్కొన్నారు. పార్టీల సంబంధం లేకుండా ప్రజలు సాగిస్తున్న ఉద్యమాన్ని చూసేనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం వెంటనే జిల్లా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలలో ఉన్న పరిశ్రమలు మూతప డి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే వారి కుటుంబాలు ఉపాధి లేకుండా వీధిన పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గం లలో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఎంతో వెనకబడి పోయారని అందువల్ల ఆదోనిని జిల్లా కేంద్రం చేస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదోని జిల్లా చేయాలని కోరగా పార్లమెంటు వారిగా జిల్లా చేస్తున్నామని కాబట్టి ఇప్పుడు చేయలేమని చెప్పి ఆధోనికి మెడికల్ కాలేజీ ఇవ్వడమే కాకుండా 60% పనులను పూర్తి చేసిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయడానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడం వలన పేదలకు వైద్యం అందుకుండా పోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఆదోని ప్రజలు జిల్లా అయితే ఈ ప్రాంతమంతా కూడా ఉద్యోగము, విద్యా అవకాశాలు పెరిగి కొత్త పరిశ్రమలు ఏర్పడి అభివృద్ధి అవుతుందని భావించి జిల్లా కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమ ప్రాంతం ప్రజలు ఉపాధి లేక వ్యవసాయ రంగం దెబ్బతిని వలసలు పోతున్నారని జిల్లా ఏర్పడితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కాబట్టి ఆదోనిని జిల్లా చేయాల్సిందేనని వారు కోరారు. మార్కాపురం, మదనపల్లి, రంపచోడవరం ప్రాంతాలను జిల్లా కేంద్రాలుగా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఆదోని జిల్లా కేంద్రం చేయడం చాలా సులువైన పని అని కాబట్టి వెంటనే ఆదోని జిల్లా చేయాలని వారు కోరారు. మెడికల్ కాలేజీని వెనకబడిన ఆదోనిలో నిర్మిస్తున్నారు కాబట్టి ఆధోనికి ప్రత్యేకమైన దృష్టిలో చూసి ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ప్రజల ఆకాంక్షగా ప్రజలు చేస్తున్న ఆందోళనను గమనించి వెంటనే ఆదోని జిల్లా చేయకపోతే అన్ని పార్టీలు అన్ని వర్గాల ప్రజలు ఐక్యమై ఆందోళన ఉధృతం అవుతుందనే వారు ప్రభుత్వానికి హెచ్చరించారు. వైకాపా తరపున కూడా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆదోని జిల్లా కోసం ఎమ్మిగనూరు నుండి బుట్టా రేణుక ఆధ్వర్యంలో భారీ ఎత్తున వాహనాల్లో దాదాపు 1000 మంది ప్రజలు తరలివచ్చి జిల్లా కోసం ఉద్యమం చేపట్టి దీక్షలు చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. మారుతి పూలమాలతో సత్కరించి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మురారి రెడ్డి, ఆదోని మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, చంద్రకాంత్ రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక


కౌశలం పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభావతి దేవి

## కౌశలం పరీక్షల పరిశీలన

ఎంపీడీవో ప్రభావతి ..

**పెద్దకడబూరు, డిసెంబర్ 2 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్ మురవణి, దొడ్డిమేకల గ్రామాల్లో కౌశలం పరీక్షలను మంగళవారం ఎంపీడీవో ప్రభావతి దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఇంటి వద్ద నుంచే పనులు చేసేందుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నేరుగా అభ్యర్థులకు పరీక్ష తేదీలను సమాచారం ఇచ్చిందన్నారు. డిసెంబర్ 2 తేదీ నుంచి 6వ తేదీ వరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో ఉదయం, సాయంత్రం సమయంలో కౌశలం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష ఆన్లైన్ లో 45 నిముషాలు పాటు ఉంటుందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అభిరూప్

## విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలి

**కోసిగి, నవంబర్ 2 :**
ఆశావర్కర్లు తమ విధులు పట్ల అంకితభావంతో పనిచేయాలనికోసిగి వైద్యులు రాజకీరిటీ, అబిరూప్ అన్నారు. మంగళవారం నాడు కోసిగి ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. .ఈ కార్యక్రమానికి వైద్యులు డాక్టర్ కిరీటి, డాక్టర్ అభిరూ ప్ మరియు సామాజిక ఆరోగ్య అధికారిని ఈశ్వరమ్మ ,పబ్లిక్ హెల్త్ నర్స్ కోటేశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులు ,ఎల్లప్ప, ఆరోగ్య పర్యవేక్షకులు రాముడు, జయమ్మ ,ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు మరియు ఆశలు పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్లు .ఆశాలకు తెలియజేస్తూ సీజనల్ వ్యాధుల పట్ల, మాత శిశు సంరక్షణ పట్ల ,పరిసరాలు పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రత ,ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల కు పిల్లలకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగినది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరగాలని ,ఎందుకంటే తల్లి బిడ్డలు క్షేమం గా ఉంటారని తెలిపారు

## బస్సులో సీటు కోసం గొడవ..

**కోసిగి, డిసెంబర్ 2 :**
ఆర్టీసీ బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు గొడవపడి గాయపడిన సంఘటన కోసిగి–ఆదోనికి వెళ్లే బస్సులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే తుంగభద్ర నుండి కోసిగి మీదుగా ఆదోని వెళ్తున్న బస్సులో అగసనూరు గ్రామానికి చెందిన మహిళ, కోసిగి గ్రామానికి చెందిన మహిళ సీటు కోసం గొడవపడ్డారు. అది కాస్త పెద్దది కావడంతో ఇద్దరు జుట్టు పట్టుకొని ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. దీంతో అగసనూరు గ్రామానికి చెందిన మహిళ బస్సులోనే స్పృహ కోల్పోయింది.. డ్రైవర్ , కండక్టర్ చేసేదిదేమీ లేక ఇద్దరికీ సర్ది చెప్పారు.


బస్సులో సీటు కోసం ఘర్షణ పడుతున్న మహిళలు

## వితంతు పింఛన్లు పంపిణీ

పెసలదిన్నెలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ పర్యటన..

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 2:**
ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నె గ్రామాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన వితంతు పింఛను లబ్ధిదారులకు అందజేశారు. రైతన్న కోసం రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.గ్రామంలో నిర్మించిన కొత్త సిసి రోడ్డును ప్రారంభించి, మిని గోకులం షెడ్ నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు.గ్రామంలోని రోడ్లు, చెరువులు, పొలం రాస్తా, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా వంటి ప్రజాప్రయోజన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు.
గ్రామ ప్రజలకు తల్లికి వందనం, మెగా డీఎస్సీ , మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతు భరోసా మరియు ఇతర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు.గ్రామ అభివృది, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి


పెన్షన్ మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి

### కారుణ్య నియామకం కింద

## పారిశుద్ధ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి

### కుటుంబాల దీక్షలకు మాజీ ఎంపి బుట్టా రేణుక సంఘీభావం..

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 2:**
ఎమ్మిగనూరు ఏఐటీయూసీఐ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ కార్మికుల 16వ రోజు నిరాహార దీక్షలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక సంఘీభావం తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూనే మరణించిన 13 మంది పారిశుద్ధ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, మానవ దృక్పథంతో కారుణ్య నియమం కింద ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేసిన పారిశుద్ధ కార్మికుల సేవలు అపూర్వమని, విపత్తులు వచ్చిన ప్రతిసారి ముందుండి పనిచేసిన ఈ కార్మికుల కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని ఆమె పేర్కొన్నారు. ఇతర మున్సిపాలిటీల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు మదనపల్లె హిందూపురం పుట్టపర్తి గుత్తి సాలూరు డోన్ మున్సిపాలిటీలలో ఇవ్వగా, స్థానిక మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఒక్క కుటుంబానికీ ఉద్యోగం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని శ్రీమతి బుట్టా రేణుక భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సిపిఐ (ఎంఎల్%–%న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు రాజు, ఏఐటీయూసీ నాయకులు తిమ్మ గురుడు, విజయేంద్ర, కార్మిక నాయకులు ఎల్లప్ప, శివకృష్ణ, ప్రతాప్, హరి ప్రసాద్, సల్మాన్, మునీంద్ర, ఇస్మాయిల్, లక్ష్మన్న, అరిఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వైఎస్ఆర్సీపీ నాయకులు బుట్టా ప్రతుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్సిపల్ కౌన్సిలర్లు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొని మద్దతు ప్రకటించారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక


పారిశుద్ధ కార్మికుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి


జిలకర పులిరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్నేహితులు

## మృతుని కుటుంబానికి స్నేహితుల అండ

**పెద్దకడబూరు, డిసెంబర్ 2 :**
పెద్దకడబూరు గ్రామానికి చెందిన జిలకర పులిరాజు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుని 2007 - 2008 పూర్వపు పదోతరగతి స్నేహితులు పులిరాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తక్షణ సహాయంగా 16,500 రూపాయల నగదును అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు.


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

## సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ఆదోని, డిసెంబర్ 2:**
డ్రైవింగ్‌లో ఫోన్ వాడితే ఒక క్షణంలో జీవితం చీకటిలోకి జారిపోతుందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ పేర్కొన్నారు. సెల్ ఫోన్ వాడడం వల్ల మీకే కాదు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు .జనవరి నుండి నవంబర్ 30 వరకు 925 సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాలకు బలికావాల్సి వస్తుందన్నారు. రహదారి నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రైడర్ బాధ్యతగా ఉండాలన్నారు. ఫోన్ మాట్లాడే ముందు ఆలోచించాలన్నారు. అత్యవసరమైతే వాహనం ప్రక్కకు ఆపి మాట్లాడం చేయాలన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడవద్దని గమ్యానికి సురక్షితంగా చేరాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సంవత్సరం 2025 జనవరి నుండి నవంబర్ 30 వరకు సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు 925 నమోదు చేశామని జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

# ప్రజలకు మంచి వైద్యం అందించండి

### కలెక్టర్ సిరి ..

**ఆదోని డిసెంబర్ 2:**
చిప్పగిరి మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రి గ్రామీణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఆరోగ్య కేంద్రం అని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. చిప్పగిరి మండల కేంద్రంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల వివరాలను తెలుసుకొని ఆమె పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవ గురించి వైద్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఆరోగ్య కేంద్రాల అవసరం ఎంత ఉందని, అమీనా పేద ప్రజలకు వైద్యం అందించాలని, ఎప్పుడు కూడా వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచనలు చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ప్రతి గ్రామంలో ప్రజలకు వైద్య సౌకర్యం అందించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో గర్భిణీలకు అందవలసినటువంటి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణుల ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న వయసులోనే వివాహాలు జరగకుండా చూడాలని బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. అలాగే ప్రతి ఒక్క పిల్లలు పాఠశాలలో చదివే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో కచ్చితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు


మందులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సిరి


ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిరి


ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సిరి. వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సిరి



ఏపిఐఐసి డైరెక్టర్ ప్రసాద్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

## ఏపిఐఐసి డైరెక్టర్ ప్రసాద్ రెడ్డికి అభినందనలు

**మండల మాజీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి .. ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు సాంబశివారెడ్డి ..**

**అట్లూరు, డిసెంబర్ 2:**
ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వద్దిబోయిన ప్రసాద్ రెడ్డిని అట్లూరు మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోవిల్ల. అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు పొన్నపోలు సాంబశివారెడ్డి, మంగళవారం బద్వేల్ పట్టణంలోని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు. అనంతరం వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న నేతలు

## తిరుపతి నారాయణాద్రి హాస్పిటల్‌లో పెన్షన్ పంపిణీ

**రామకుప్పం, డిసెంబర్ 2:**
మండలంలోని సింగసముద్రం పంచాయతీ రెడ్డివారిపల్లి రామాను చెందిన సాలమ్మ అనారోగ్యంతో తిరుపతి నారాయణాద్రి ఆర్ట్ ఆపరేషన్ అయింది. సమాచారం తెలుసుకున్న టిడిపి నేతలు సచివాలయ సిబ్బందితో మంగళవారం ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కృష్ణప్ప, పంచాయతీ పార్టీ కార్యదర్శి వాసు, అప్పోజి బాలచంద్ర నాయుడు, పార్థసారథి పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా ఏర్పాటు ఆందోళనకు మద్దతు

**మాజీ ఎంపి శ్రీమతి బుట్టా రేణుక ..**

రాయలసీమ పశ్చిమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆదోని జిలా ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్‌కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపింది. ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదోనిలో ఏర్పాటు చేసిన శిబిరానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూల్ పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక భారీ జనసందోహంతో హాజరై సంఘీభావం తెలిపారు. ఎమ్మిగనూరు నుండి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో నేతల ఆధ్వర్యంలో ఆదోనికి చేరుకున్నారు. ఎమ్మిగనూరులోని డా. వైయస్సార్ విగ్రహానికి పూలదండలు సమర్పించిన అనంతరం, శ్రేణులు వాహనాల్లో ఆదోనికి బయలుదేరారు. బుట్టా రేణుక, బుట్టా ప్రతుల్ నేతృత్వం వహించిన ఈ ర్యాలీ ఆదోని పట్టణంలో బహుళ క్యాడర్ పాల్గొనడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శిబిరంలో మాట్లాడిన శ్రీమతి బుట్టా రేణుక రాయలసీమ పశ్చిమ ప్రాంతంలో అభివృద్ధి అవకాశాలు ఇంకా అనేకం ఉన్నప్పటికీ, పరిపాలనా విభజన లోపంతో ఈ ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడిపోయాయని పేర్కొన్నారు. ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు వంటి మండలాలు విస్తారమైన జనాభా కలిగి ఉన్నప్పటికీ, కర్నూలుకు దూరం కారణంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాలు రాష్ట్రంలో అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన మండలాలకు చెందుతాయని, కోసిగి, హొళగుందా, ఆలూరు, ఆదోని,ఎమ్మిగనూరు వంటి ప్రాంతాల్లో చదువు, ఆరోగ్యం,ఉపాధి, వ్యవసాయం, సదుపాయాలు అభివృద్ధి చెందాలంటే పరిపాలనా పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి అని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, పులికనుమా వంటి ప్రాజెక్టులు సక్రమంగా అమలు చేస్తే సాగునీరు, త్రాగునీరు సమస్యలు గణనీయంగా తగ్గుతాయని వారు పేర్కొన్నారు.
రాయలసీమ పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు, నిరుద్యోగం వంటి సమస్యలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో, ప్రాంతీయ ప్రజలకు సమీపంలోనే పరిపాలన అందే విధంగా ఆదోని జిల్లాగా ప్రకటించడం అత్యవసరమని నాయకులు భావించారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించాలంటే జిల్లా స్థాయి పరిపాలన అవసరం ఉన్నదని వారు వివరించారు.ప్రజల దీర్ఘకాలిక కోరికను, ప్రాంత అభివృద్ధి అవసరాన్ని, వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ప్రాంతీయ ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ప్రభుత్వం స్పందించాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపి బుట్టా రేణుక

# చంద్రన్న బీమా టిడిపి కార్యకర్తలకు ధీమా

**ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ..**

**దువ్వూరు, నవంబర్ 2:**
చంద్రన్న బీమా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు దీమా అని మైదుకూరు శాసనసభ్యులు పుట్ట సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో మర్తల గురివిరెడ్డి మరణించడంతో టీడీపీ సభ్యత నమోదు చేసుకున్నా గురివిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ సభ్యత్వ నమోదులో ఐదు లక్షల బీమా మృతిని కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు సభ్యత్వ నమోదు ఈ కుటుంబానికి భరోసాని తెలిపారు. కార్యకర్తలకు టిడిపి ఎప్పటికీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం ఎస్ఆర్ వన్ తెలుగుగంగ డ్యాం దగ్గరికి వెళ్లి పరిశీలించి జల హారతి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, దువ్వూరు టౌన్ ఇంచార్జి పాపినేని రాంబాబు, దువ్వూరు ప్రాథమిక సహకార సొసైటీ చైర్మన్ పోలు రామ మోహన్ రెడ్డి, కేసీ కెనాల్ నీటి సంఘం చైర్మన్ కోనేటి హరినాథ్, తెలుగు



కార్యకర్త కుటుంబానికి డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

రైతు నియోజకవర్గ అధ్యక్షులు కారపురెడ్డి సంజీవరెడ్డి, టిడిపి నాయకులు తాహిర్ హుస్సేన్,శెట్టి నాగరాజు యాదవ్, వెంకటసుబ్బయ్య నాయుడు, గంగి రెడ్డి గారి భాస్కర్ రెడ్డి, అందే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి గోదాములు మంజూరు

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి.. ఉద్యాన శాఖ అధికారి సి. రామకృష్ణ ..**

**దువ్వూరు, నవంబర్ 2 :**
కె.పి ఉల్లి గడ్డలను నిల్వ చేసుకునేందుకు రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం గోదాములకు రాయితీ అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు ఉద్యాన అధికారి సి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం లో దువ్వూరు మండలంలో 800 ఎకరాలల్లో, మైదుకూరు మండలంలో 250 ఎకరాలలో కె.పి ఉల్లి పంటను రైతులు సాగు చేయడం జరిగిందని,
ఈ పంట డిసెంబరు, జనవరి నెలలో కోతకు వస్తుందని తెలియజేశారు. రైతులకు ఉల్లి పంట నిలువ చేసుకునే గోదాములు అందుబాటులో లేని కారణంగా రైతులు తమ పంటను వెంటనే అమ్ముకోవడం జరుగుతుంది సరైన ధర రాకపోవడంతో రైతు ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుంది, రైతు స్థాయిలో ఉల్లి నిలువ చేసుకునే గోదాముల కొరకు ఉద్యాన శాఖ 50% రాయితీ అందిస్తుందని వాటిని రైతులు నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ తెలియజేశారు.ఒక్కో యూనిట్ ధర 1.75 లక్షల కాగా రాయితీ 87,500 వస్తుందని తెలిపారు. ఉల్లిగడ్డల ధరలు తక్కువగా




గోదాముల నమూనా

ఉన్నప్పుడు ఒక్కొక్క గోదాములో దాదాపు 25 టన్నుల వరకు నిల్వ చేసుకోవచ్చు అని తెలిపారు. ఉల్లి గోదాములు గురించి పూర్తి వివరాల కోసం మీ యొక్క రైతు సేవ కేంద్రంలోని గ్రామ ఉద్యాన లేదా వ్యవసాయ సిబ్బందిని సంప్రదించవలసినదిగా ఆయన తెలిపారు.

# పేద కుటుంబాలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్

**అత్యవసర వైద్యసేవలకు కోట్లు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి.. ఆత్మకూరులో ఇప్పటివరకు 565మందికి రూ.5.72 కోట్లు మంజూరు.. రాష్ట దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..**

**ఆత్మకూరు, డిసెంబర్ 2 :**
పేదల ఆరోగ్యభద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, పేద,మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఆత్మకూరు ఆర్అండ్‌బి అతిథిగృహంలో 28 కుటుంబాలకు రూ.35.21 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బాధిత కుటుంబసభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేటు ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాదిరూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారని చెప్పారు.
ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 565మందికి రూ.5.72కోట్లు మంజూరు చేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచినట్లు చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు


**అమరాపురం, డిసెంబర్ 2:**
అమరాపురంలో భక్తాంజనేయ స్వామి దేవాలయము నందు హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా మంగళవారం శ్రీ హనుమంతునికి హెూమం,అభిషేకం, కుంకుమార్చన, పంచామృత



శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం



అభిషేకం వివిధ రకాల పూజలు అర్చకులు రవి స్వామి నిర్వహించారు.
కార్యనిర్వహకులు బావాజీ లక్ష్మణ దాస్ మరియు బంధుమిత్రులు పూజల్లో పాల్గొన్నారు.. శ్రీ హనుమంతునికి పూలతో అలంకరణ చేశారు . భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు భక్తులకు అన్నదానం నిర్వహించారు.లి నేడు శ్రీ హనుమంతునికి ఉయ్యాల ఉత్సవంలిభక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారుజామున శ్రీ హనుమంతునికి అభిషేకం పంచామృత అభిషేకం హెూమం తదితర పూజలు ఆలయ అర్చకులు రవి స్వామి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు బావాజీ లక్ష్మణదాస్ బంధుమిత్రులు వీరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు భక్తులు అధిక సంఖ్యలో శ్రీ హనుమంతుని ఉయ్యాల ఉత్సవానికి భక్తులు తరలి రావాలని వారు కోరారు.



శ్రీ హనుమంతునికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు రవి స్వామి. పూజలు నిర్వహిస్తున్న బావాజీ లక్ష్మందాస్, బంధుమిత్రులు . భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం



ఎలక్ట్రిక్ ఈ ఆటోలకు పూజలు చేస్తున్న కూటమి నేతలు

## కుప్పంను ఆదర్శ నియోజకవర్గం చేయడమే సీఎం లక్ష్యం

**ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ..**

**రామకుప్పం, డిసెంబర్ 2:**
రాష్ట్రంలోనే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నాడని ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎలక్ట్రిక్ ఈ ఆటోలకు పూజలు చేసి మండలంలోని 22 పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 లక్షల విలువగల 22 ఎలక్ట్రిక్ ఆటోలను ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ జరుగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని ఘననీయంగా తగ్గించి పచ్చదనానికి మరింత అభివృద్ధి దిశగా ప్రజలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి రామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు, జనసేన హరీష్, నేతలు రామ్మూర్తి, కన్నన్, గుర్రప్ప, చలపతి, చిన్న కృష్ణ, కృష్ణా నాయక్, మహమ్మద్ రఫీ, విశ్వనాథ్, రవి రెడ్డి, రఘు, రామకృష్ణప్ప, విజయ్ రెడ్డి , శంకరాచలం,అవినాష్, ఆదిల్, బాలు, సుబ్రి, సురేష్,అమర్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చెరువు ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, శ్రీనిధి బట్టర్ భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

## ఘనంగా శ్రీ ఆంజనేయస్వామికి పూజలు

**అమరాపురం, డిసెంబర్ 2:**
అమరాపురంలోని చెరువు ఆంజనేయస్వామి ఉదయం హెూమం అభిషేకం కుంకుమార్చన వివిధ రకాల పూజలు అర్చకులు శ్రీనిధి బట్టర్ నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామికి పూలతో అలంకరణ చేసి మహా మంగళహారతి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. అమరాపురం గ్రామం నుండి కాకుండా వివిధ గ్రామాల నుండి భక్తులు తరలివచ్చారు. వచ్చిన భక్తాదులకు అన్నదానం నిర్వహించారు.



చెరువు ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## రాయితీ కోసం కొబ్బరి రైతులు దరఖాస్తులు చేసుకోండి

**వక్క సుగంధద్రవ్యాల రైతు సంఘం అధ్యక్షులు ఉగ్ర నరసింహ..**

**అమరాపురం,, డిసెంబర్ 2:**
కేంద్ర కోకోనేట్ బోర్డు కొబ్బరి పంట సాగు చేసే రైతులకు అందించే రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం వక్క సుగంధ్ర ద్రవ్యాల రైతు సంఘం అధ్యక్షులు ఉగ్ర నరసింహ పేర్కొన్నారు. కొత్తగా కొబ్బరి మొక్కలు సాగు చేసే రైతులకు ఒక మొక్కకు ఒక సంవత్సరానికి రూ.150 తోట సాగుకు సంరక్షణకు ప్రోత్సాహక ధనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని బోరు బావులు ఉన్న రైతులు వన్ బి, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ నకలు,ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కొబ్బరి మొక్కలు సాగు చేసే ప్రతి రైతు రూ. 143 కట్టి బీమా చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రైతుకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రమాదాల కారణంగా లభించే ప్రయోజనాలు క్రింద ఇలా ఉన్నాయి. మరణం, శాశ్వత పూర్తి వైకల్యం నకు మొత్తం బీమా రూ.7,00,000, శాశ్వత పాక్షిక వైకల్యం బీమా రూ. 3,50,000, డిస్చార్జ్ తర్వాత గరిష్టంగా రెండు నెలల వరకు మందులతో సహా ఆసుపత్రి ఖర్చులు తిరిగి చెల్లింపు రూ. 200,000, ప్రమాదం మరియు మరణం సంభవించినప్పుడు అంబులెన్స్ ఖర్చులు ( బిల్లుల ప్రకారం) రూ.3,500, తాత్కాలిక పూర్తి వైకల్యం విషయంలో వారపు పరిహారం రూ. 21,000, బై స్టాండర్డ్ ఖర్చులు ఆస్పత్రిలో చేరిన కాలంలో రోజుకు వాస్తవ బిల్లుల ఆధారం ప్రకారం రూ. 3,000, ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు అంత్యక్రియల ఖర్చులకు రూ. 5,500/- బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం తీసుకోవాలని, మరిన్ని వివరాల కొరకు ఈ ఫోన్ నెంబర్:9440798591, 8919945616కు సంప్రదించాలని మడకశిర తాలూకా సుగంధద్రవ్యాల రైతు సంఘం అధ్యక్షులు ఉగ్ర నరసింహ కోరారు.



## ఓట్ చోరీ ద్వారా బీహార్‌లో అధికారంలోకి కూటమి

**విశాఖపట్నం, డిసెంబర్ 2:**
ఓట్ చోరీ ద్వారా బీహార్ బిజెపి ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్ ఫలితాలను ఎవరూ ఊహించలేదన్నారు. ప్రతిపక్షాలు ఓటు చోరీపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన క్షేత్రస్థాయిలో అడ్డుకోలేకపోయాయని తెలిపారు. బీహార్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్.ఐ.ఆర్. - సర్) ద్వారా బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించారని, పెద్ద ఎత్తున అనుకూల ఓట్లను చేర్పించారని చెప్పారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఆఫీసర్లపై ఒత్తిడి తెచ్చి ప్రతిపక్షాల ఓట్లను తొలగించారని అన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాల్సి ఉందన్నారు.

C M Y K





కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

## పూర్వవిద్యార్థుల దాతృత్వం

*10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేత..*

**బెళుగుప్ప, డిసెంబర్ 3:**
బెళుగుప్ప మండలం పరిధిలోని కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు దాతృత్వంతో 10వ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ను అందించారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల అయినటువంటి కేజీ నాగిరెడ్డి తన సొంత ఖర్చులతో, నిపుణులచే తయారు చేయించబడిన మోడల్ పేపర్స్,స్టడీ మెటీరియల్ ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేజీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ 100 రోజులు ఒక దీక్షగా భావించి మెటీరియల్ చదువుకోవాలని%ౌ% ఖచ్చితంగా 100 శాతం ఉత్తీర్ణత పొంది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు%ౌ% అదే విధంగా బడుగు బలహీన వర్గాలు విద్యలో రాణించాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మరియు సేవాభావం అలవర్చుకోవాలని ఆకాంక్షించారు%ౌ% ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, మిత్రులు పాతిరెడ్డి నీలకంఠారెడ్డి, నాగరాజు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

**తాడిపత్రి, డిసెంబర్ 2:**
మండల పరిధిలోని గన్నెవారి పల్లి కాలనీలో మంగళవారం సాయంత్రం పర్యటించిన శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డి తాడిపత్రి మండలంలోని గన్నెవారి పల్లి కాలనీ నందు పర్యటించినప్పుడు కాలనీలో తాగునీరు సమస్య పరిష్కానికి ఆత్యాధునిక మైన మోటార్లు అమర్చడంతో తాగునీరు సంవృద్ధిగా వస్తుండడంతో, కాలనీలో తాగునీరు సమస్యను తీర్చినందుకు ప్రజలు ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి దృష్టికి ప్రజలు పలు సమస్యలు తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, మండల టీడీపీ, జనసేన బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, జేసీ అభిమానులు పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## పేదలకు వైద్య విద్యను దూరం చేయవద్దు

*ముష్టూరు నరసింహారెడ్డి..*

**బత్తలపల్లి, డిసెంబర్ 2:**
మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు బత్తలపల్లి మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.?ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి మాట్లాడుతూ,మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య భారం అవుతుంది.లక్షల రూపాయలు ఉన్న ఫీజు కోటి రూపాయలకు పెరుగుతుంది.చంద్రబాబు సర్కార్ పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తోంది,అని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ప్రైవేటీకరణ సమస్యలను వివరించి సంతకాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు సుధాకర్ రెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చిట్టి బాల మనోహర్ రెడ్డి, కుమ్మర శ్రీరాములు, బోయ సాంబశివుడు, కొట్టాల నరసప్ప, చంద్ర సాంబశివుడు, పెద్దన్న, ఈశ్వరయ్య, కాటమరాయుడు తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఈదుల ముష్టూరులో కోటి సంతకాలు సేకరిస్తున్న నరసింహారెడ్డి, నాయకులు,కార్యకర్తలు

## ఘనంగా శ్రీ హనుమంతుని జలధి ఉత్సవం

**అమరాపురం, డిసెంబర్ 2:**
మండల పరిధిలో పుల్లి కుంట గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకము, కుంకుమార్చన, హెూమం అర్చకులు పూజలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామిని ట్రాక్టర్ నందు ప్రత్యేకంగా అలంకరించి శ్రీ ఆంజనేయ స్వామిని ఊరి చివరన గల వంక వద్దకు తీసుకుని వచ్చి శ్రీ ఆంజనేయ స్వామికి జలది పూజ ఉత్సవం అర్చకులు గ్రామస్తులు నిర్వహించారు. వచ్చిన భక్తులకు మహా మంగళహారతి తీర్థప్రసాదాలు అందజేశారు.. వంక వద్ద నుండి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు మహిళలు అధిక సంఖ్యలో హారతులతో ఊరేగింపుగా ఆలయము చేరుకుని ఆలయము చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.





శ్రీ ఆంజనేయ స్వామిని ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం శ్రీ ఆంజనేయ స్వామికి జలధి పూజ చేస్తున్న భక్తులు

# అరటి తోటల పరిశీలన

### ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ..

**బెళుగుప్ప, డిసెంబర్ 2:**
బెళుగుప్ప మండల పరిధిలోని అంకంపల్లి, దుద్దేకుంట గ్రామాల్లోని అరటి తోటలను మంగళవారం ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ పరిశీలించారు. అరటి ఫ్రూట్ కేర్ ఆక్టివిటీ పరిశీలన చేశారు. ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ అరటి రైతులతో మాట్లాడుతూ అరటి మొదటి, రెండవ పంట కోత జరుగుతున్న తోటలను సందర్శించి రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.అరటిపంట ప్రస్తుతం కిలో ఐదు నుంచి ఆరు రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని కానీ అరటి క్వాలిటీ తో ఉన్నట్లయితే 8 నుంచి 12 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులకు



అంకంపల్లి, దుద్దేకుంట గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ



అంకంపల్లి, దుద్దేకుంట గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ

తెలిపారు. బనానా క్వాలిటీ ఇంప్రూవ్మెంట్, ప్లాంట్ ప్రొటెక్షన్ మెసెర్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి సిగటక ఆకుమచ్చ తెగులు పై రైతులకు సూచనలు ఇచ్చారు. తెగులు ప్రారంభ దశలో పసుపు మచ్చలు ఏర్పడి తర్వాత బూడిద గోధుమ రంగుకు మారి ఆకులు ఎండిపోతాయని వివరించారు. ఇది సోకకుండా ఉండాలంటే తోటలో కలుపు మొక్కలను తొలగించడమే కాకుండా నీరు నిల్వ లేకుండా నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. తెగులు వ్యాప్తి మొదలైనప్పుడు మొదటి పిచికారి ప్రొపీక్ కొనజోల్ వన్ ఎం.ఎల్ లీటర్ నీటికి, రెండవ పిచికారి కార్బేండాజిమ్ం మ్యాంకోజబ్ 1గ్రా / లీ నీటికి, మూడవ పిచికారీ ప్రొపికొనొజోలు ం మ్యాంకోజెబ్ మిశ్రమం 1.4 గ్రా /లీటర్ నీటికి, ఐదవ పిచికారీ పైరాక్లోస్ట్రోబిన్ 133 ం ఎపోనికొనొజోల్ 50 ఎస్.సీ ం మినరల్ ఆయిల్ పిచికారి చేయవలసింది రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఆర్ ఎస్ కే సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలి

### పార్టీ గెలుపునకు కార్యకర్తలు ఉద్యమంలా పనిచేయాలి కనేకల్ మండల అబ్జర్వర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్ ..

**కనేకల్లు డిసెంబర్ 2 :**
రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పిటిసి,ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ప్రతి అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపుకు కృషి చేయాలని కనేకల్ మండల అబ్జర్వర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట, బ్రహ్మసముద్రం పరిశీలకులుగా కేంద్ర కార్యాలయం నుండి రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్ ను నియమించారు. పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం కనేకల్ మండల ప్రాంతంలో విచ్చేశారు. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్లను, కో కన్వీనర్లను,ఎస్కే ఎస్ ఎస్ నెంబర్లను, గ్రామ కమిటీ సభ్యులను, క్లస్టర్ మరియు మండల కన్వీనర్ల సమావేశం ఏర్పాటు చేశారు.



కనేకల్ మండలం అబ్జర్వర్ రజక సంఘం డైరెక్టర్ పరమేష్ కు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కనేకల్ మండల అబ్జర్వర్, రజక సంఘం డైరెక్టర్ పరమేష్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తీసుకుంటున్నటువంటి చర్యలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని అన్నారు. పార్టీని బూతుల వారుగా పటిష్టం చేసుకుని అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోవు జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. బూత్ స్థాయిలలో మరియు గ్రామస్థాయిలలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసన సభ్యులు కాలువ శ్రీనివాసులు గారి దృష్టికి తీసుకువెళ్లి నా వంతు బాధ్యతగా మీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాబట్టి బాబు స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనేకల్ మండల టిడిపి అధ్యక్షులు వన్నారెడ్డి, మాజీ మండల కన్వీనర్ లాలెప్ప,క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ రాజ్,కో క్లస్టర్ పీవీ రామప్ప, రఘు,రామాంజనేయులు, సుంకన్న,జగన్నాథ్, రంగనాథ్, గిరి,మల్లయ్య చౌదరి,పార్వతి, సువర్ణమ్మ, చెరువు సంఘం సాగునీటి అధ్యక్షులు బిటి రమేష్, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, చాంద్ బాషా పాల్గొన్నారు.

# రాయలచెరువు ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశం

**యాడికి, డిసెంబర్ 2 :**
యాడికి మండలం రాయల చెరువు గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాను సారం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు నిర్వహించారు. మేల్ అండ్ ఫిమేల్ అసిస్టెంట్లు, ఎం ఎల్ హెచ్ పీలు, ఆశా కార్యకర్తలకు వెక్టార్ కంట్రోల్ ఐజిన్, డ్రై డే ఫ్రైడే గురించి వివరించారు. ప్రతి శుక్రవారం గ్రామంలో ఫ్రైడే ఫ్రైడే



రాయల చెరువు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది



రాయల చెరువు ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పయ్య

తప్పక నిర్వహించాలన్నారు. గ్రామంలో జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపూతలు తీయాలన్నారు. ఆరోగ్య కార్యకర్త మేల్ అండ్ ఫిమేల్ డైరీ ఎంఎస్ టులను పరిశీలించారు. పి హెచ్సి ల్యాబ్ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అప్పయ్య. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పి హెచ్ ఎన్ గంగాదేవి మేల్ సూపర్వైజర్ షబ్బీర్ అహ్మద్ ఏఎన్ఎంలు ఎమ్ ఎల్ హెచ్ పి లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల తనిఖీ

### పిడి సలీం బాషు..

**బెళుగుప్ప, డిసెంబర్ 2:**
గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను శాశ్వతంగా ఉండేలా చూడాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పీడీ సలీం భాష పేర్కొన్నారు. మంగళవారం బెళుగుప్ప మండలం పరిధిలోని అంకంపల్లి, రామసాగరం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ఏపీవో మురళితో కలసి పిడి సలీం భాష తనిఖీ చేశారు. రామసాగరంలో ఎన్ఆర్ఈజీఎస్ లో భాగంగా నిర్మించిన గోకులం షెడ్లను, అంకంపల్లి లో పల్లెవనం లో



అంకంపల్లిలో పల్లెవనంలో భాగంగా ప్లాంటేషన్లో చేపట్టిన మొక్కలను పరిశీలిస్తున్న పీడీ సలీం బాష, ఏపీవో మురళి




రామసాగరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన గోకులం షెడ్లను పరిశీలిస్తున్న పిడి సలీం బాష

భాగంగా ప్లాంటేషన్ ను పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు ప్రజలకు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పనులను చేయాలన్నారు. రామసాగరం,అంకంపల్లి గ్రామాల్లో చేపట్టిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయని, ఇతర గ్రామపంచాయతీలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పల్లెవనంలో భాగంగా ప్లాంటేషన్ ద్వారా నాటిన మొక్కలు బాగా అభివృద్ధి చెందాయన్నారు. రెండు సంవత్సరాల కాలం పాటు వాటిని కాపాడుకుంటే ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆహ్లాదంతో పాటు ఆర్థిక వనరుల చేకూర్చే విధంగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడి సలీం భాషా తో పాటు ఏపీవో మురళి, టీడీపీ నాయకులు ఎర్రే గౌడ్, ఎర్రిస్వామి,ఫీల్డ్ అసిస్టెంట్ వన్నూరుస్వామి, అంకంపల్లి మాజీ ఎంపీటీసీ శంకరయ్య, పురుషోత్తం నాయుడు, కిష్టయ్య, శ్రీనివాసులు, ఈశ్వర్, వేణుగోపాల్,పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్కె సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆర్ఎస్కె సిబ్బందికి శిక్షణ

**కనేకల్, డిసెంబర్ 2:**
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తాసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో జయసింహారెడ్డి సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, సివిల్ సప్లై ఏఎం జనరల్ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ ముఖేష్ తదితరులు అవగాహన కల్పించారు. రైతుల దగ్గర నుండి ధాన్యాన్ని ఈ విధంగా సేకరించాలి, సేకరించిన ధాన్యాన్ని ఎలా తూకాలు వేసి రైతులకు సరైన సమయంలో డబ్బులు చెల్లించాలి అని దానిపై సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులకు ఏ సమస్యలు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జీడి ఉమామహేశ్వరమ్మ అగ్రికల్చర్ ఏవో రమేష్,గ్రామ రెవెన్యూ అధికారులు కరణం పవన్ కుమార్, రుద్రప్ప కనేకల్ బొమ్మనహాళ్ హీరేహాళ్ మండలాల ఆర్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.



పాపంపల్లింలో మురికిగుంటల్లా దర్శనమిస్తున్న వీధులు

## రన్నింగ్లో మోటార్లు వీధుల్లో పారుతున్న నీరు..

**ఆత్మకూరు, డిసెంబర్ 2:**
మండల పరిధిలోని పలు గ్రామాలలో మోటర్లు ఆడడానికి విద్యుత్ సరఫరా చేసినంత సేపు రక్షిత మంచినీటి సరఫరా మోటార్లు రన్నింగ్లోనే ఉంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. అవసరం లేకున్నా భూగర్భ జలాలు తోడేస్తున్నారు. వీధులన్నీ మురికి గుంటల్లా తయారయ్యాయి. అధికారులేమో గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారానికో మారు సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. పంచాయితీల పరిపాలన అస్తవ్యస్తంగా ఉన్నందున పరిశుభ్రత సంగతి దేవుడు ఎరుగు కానీ నీటిని ఆదా చేయడం ఎన్నడు నేర్చుకుంటాము. అర్థం కాని పరిస్థితి గ్రామాలలో నెలకొంది. సిమెంట్ రోడ్లు అయితే వేశారు కానీ సిమెంటు రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం మరిచారు. దాంతో గ్రామాల వీధులు మురికిగుంటల్లా తయారయ్యాయి. అధికారులు చొరవ తీసుకొని గ్రామాలలో శాశ్వత పరిశుభ్రతకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాగే ఉంటే చలికాలం వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారి మురికి కంపు కొడుతూ దోమల వ్యాప్తి జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరా మోటార్లు గ్రామాలలో అవసరమైనంత మేరకు నీరు తోడితే నీటి నిల్వలు ఆదా చేయడమే కాక గ్రామాలు పరిశుభ్రంగా ఉండగలుగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిష్కరించాలని, గ్రామాలలో పరిశుభ్రతకు అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాపంపల్లింలో మురికిగుంటల్లా దర్శనమిస్తున్న వీధులు

## తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాలో నేడు సీఎం చంద్రబాబు పర్యటన

**అమరావతి, డిసెంబర్ 2:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు తూర్పు గోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. బుధవారం జరగనున్న రెండు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రేపు ఉదయం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో జరగనున్న "రైతన్నా... మీ కోసం" వర్క్ షాప్ లో పాల్గొననున్నారు. గత నెల 24వ తేదీ నుంచి 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా "రైతన్నా... మీ కోసం" పేరుతో రైతుల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇంటింటా చేసిన ప్రచారంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలను ప్రచారం చేశారు. అలాగే సీఎం చంద్రబాబు రాసిన లేఖను ప్రతి రైతు ఇంటికి వెళ్లి ఈ ప్రచారంలో క్షేత్ర స్థాయి అధికారులు మొదలుకుని ఉన్నతాధికారులు, అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా "రైతన్నా... మీ కోసం" వర్క్ షాప్ నిర్వహించనున్నారు. నల్లజర్లలో జరగనున్న వర్క్ షాప్ కు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి నల్లజర్లకు బయలుదేరతారు. 10.55 గంటలకు నల్లజర్లకు చేరుకుంటారు. స్థానికంగా ఉన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం వర్క్ షాప్ ప్రాగంణంలో ఏర్పాటు చేసిన "రైతన్నా... మీ కోసం"స్టాల్లను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 11.50 గంటలకు ప్రజావేదిక సభలో రైతులు, రైతు కుటుంబాలతో ముఖ్యమంత్రి ముఖాముఖి అయ్యి ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 01.45 గంటల నుంచి 03.15 గంటల వరకు కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొనున్నారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం చేరుకుని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.


# సెలబ్రటీలు చనిపోతే ఇంత దిగజారుడా

ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టా÷-గ్గ÷ట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.




# హిందీలో ఎంట్రీకి ఆర్భాటం తప్పనిసరి



హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# సమంత దంపతులు అమెరికాలో సెటిలవుతారా



రాజ్, సమంతల వివాహంపై గతంలో జ్యోతిష్యుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

2023 జూన్ 27న ఆయన చేసిన ట్వీట్‌లో .. సమంత 2024లో ప్రేమలో పడుతుంది, 2025లో రెండో పెళ్లి చేసుకుంటుంది, 2026లో భర్తతో కలిసి అమెరికాలో సెటిల్ అవుతుందని పేర్కొన్నారు. ఈ జోష్యంలో ముందటి రెండు విషయాలు నిజమవడంతో, ఇప్పుడు మూడో అంశం సమంత 2026లో అమెరికాకు వెళ్లి సెటిల్ అవుతుందా? అని నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ కినీ కూడా తాజాగా స్పందిస్తూ, సమంత విషయంలో నేను చెప్పిన జ్యోతిష్యం నిజమైంది అని మరోసారి పోస్ట్ చేశారు. అయితే సమంత 2026లో అమెరికాలో సెటిల్ అయితే?ఆమె సినిమాలకు గుడ్‌బై చెబుతుందా? ఇకపై టాలీవుడ్ ప్రాజెక్టుల్లో కనిపించదా? అంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బంధం వున్నంతవరకే ...



రాజ్‌నిడుమోరు మాజీ భార్య శ్యామాలి

తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వస్తోన్న రూమర్స్‌కు చెక్ పెడుతూ దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు నెటిజన్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతోన్న వేళ.. రాజ్ మాజీ భార్య శ్యామాలి పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎప్పుడూ తన ఆలోచనలను సోషల్ మీడియా వేదికగా పంచుకునే ఆమె తాజాగా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. 'ఈ అనంత విశ్వంలో మనం ఒక మూల ఉన్నాం' అని అర్థం వచ్చేలా ఒక ఇమేజ్ షేర్ చేశారు. రాజ్ – సమంతల వివాహం జరిగిన రోజు సోమవారం కూడా శ్యామాలి పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని ఆమె రాసుకొచ్చారు. అలాగే, మనతో రుణం ఉన్నంత వరకే బంధాలు అన్నీ ఉంటాయి. రుణం తీరిన తర్వాత బంధం శాశ్వతంగా దూరమవుతుందని శ్యామాలి ఐదు రోజుల క్రితం తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.

# అడల్ట్ కామెడీతో సైక్ సిద్ధార్థ



టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్దార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.

# యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించేదాన్ని.. రసిక



బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.